క్లుప్తంగా

వంట చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

గండేపల్లి: వంట చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎంఈఓ-2 కె.వెంకటరెడ్డి మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వాహకులకు తెలియజేశారు. మండలంలోని గండేపల్లి జెడ్పీ స్కూల్లో బుధవారం ఎండీఎం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పథకం నిర్వాహణ, విద్యార్థులకు భోజనాలు తయారుచేసే సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంట తయారు చేసే ప్రాంతంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ, సీఆర్పీలు, జిల్లా ఆర్పీ రాజ్యలక్ష్మి, మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలల పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



ఏలేశ్వరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పట్టణంలో నిర్వహించిన దివంగత వరుపుల రాజా మోమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో ఏలేశ్వరం బ్యాడ్ బాయ్స్ టీమ్ విజేతగా నిలవగా జగ్గంపేట వారియర్స్ టీం రన్నర్స్‌గా నిలిచింది. ప్రథమ విజేతకు మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి రూ.50 వేల నగదు, రన్నర్స్‌కు ముగడ శ్రీనివాస్ రూ.30 వేలు ఆర్థిక సహాయంతో ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, శిడగం బాలు, కిలారి రాంబాబు, గొంతిరెడ్డి రవి పాల్గొన్నారు.

గోవులను సంరక్షించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: హిందువులు ఆరాధ్యదైవంగా భావించే గోవులను సంరక్షించాలని విశ్వహిందూ పరిషత్ పట్టణ శాఖ కోరింది. ఈ మేరకు పట్టణంలో బుధవారం గోరక్ష విభాగం సభ్యులు తహసీల్దార్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవధకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకటప్రసాద్, తూమురౌతు గురయ్య, గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

గండేపల్లి: గండేపల్లి మహర్షి జ్యోతిషాలయం అమ్మ వారి పీఠం వద్ద రుద్ర సహిత చండీ యాగం మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. వేద పండితులు దువ్వూరి శేషగిరి శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించిన శత చండీ పారాయణ, రుద్రహోమం, చండీ హోమం తదితర విశేష హోమ, పూజలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలు బుధవారం మధ్యాహ్నం మహాపూర్ణాహుతితో ముగిసిందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తొండంగి: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం మండలంలోని పెరుమాళ్లపురంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు విద్యుత్, రోడ్లు, డ్రెయిన్లు పలు సమస్యలపై 140 వరకూ దరఖాస్తులందించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వరరావు, తహసీల్దార్ ముఖర్జీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తుని: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు ఎంత విసుగు చెందిపోయారో తుని పట్టణంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ వెన్నుపోటు దినోత్సవానికి హాజరైన జన సమూహం నిదర్శనంగా నిలిచింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తునిలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి పాదయాత్రగా ర్యాలీ బయలుదేరింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంజనేయస్వామికి కొబ్బరికాయ కొట్టి పాదయాత్ర ప్రారంభించారు. గొల్ల అప్పారావు సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. పట్టణంలోని రోడ్లు వైఎస్సార్ సీపీ జెండాలు, ప్రభుత్వ వ్యతిరేక ప్లకార్డులతో కిక్కిరిసింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



తునిలో 'వెన్ను పోటు దినం' ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

'ఒక్క హామీనైనా అమలు చేశారా'



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీని కూడా అమలుచేయకుండా ప్రజలను దగా చేశారు. స్వచ్ఛందంగా ప్రజలు రోడ్డుకు మీదకు వచ్చి వెన్నుపోటు కార్యక్రమంలో ప్రభుత్వ వ్యతిరేకతను రుచి చూపించారు.ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఏమీ ప్రజలకు నెరవేర్చలేదు. వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, చిరువ్యాపారస్తులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా నగదు లావాదేవీలు పడిపోయాయి. ఖజానా అంతా చంద్రబాబు చేతుల్లోనే ఉంది. జగన్ పరిపాలనకు చంద్రబాబు పరిపాలనకు చాలా తేడా వుంది. జగన్ ప్రభుత్వంలో 13శాతం జీఎస్టీ వృద్ధి నిరంతరంగా ఐదు సంవత్సరాలు కనిపిస్తే, చంద్రబాబు ప్రభుత్వంలో మైనస్ 3శాతం రికార్డు అయ్యింది. ఆ 10 శాతం మార్జిన్ ఎవరి జేబుల్లోకి వెళ్తుంది. సంపద సృష్టిస్తామని, మాది డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పి రాష్ట్ర ప్రజలను డబుల్ దగా చేశారు. కేంద్రం ఇచ్చిన గ్రాంటు, నిధులు అంతా బాబు అండ్ కో జేబుల్లోకి వెళ్ళిపోతుంది తప్పితే ప్రజల దరిచేరడంలేదు. టెన్త్ పేపర్లు కూడా సక్రమంగా దిద్దించలేకుండా ఉన్నందుకు ఇది మంచి ప్రభుత్వమా? దేనికి ఇది మంచి ప్రభుత్వం ఆలోచించండి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని మరో 15 సంవత్సరాలు వెనక్కి తీసుకుపోయారు.

– దాడిశెట్టి రాజా,
మాజీ మంత్రి, పార్టీ అధ్యక్షుడు

ప్రజల సొమ్మును కూటమి నాయకులు దోచుకున్నారు

కేంద్ర ప్రభుత్వం నిధులు, ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్మును కూటమి నాయకులు దోచుకున్నారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చారని, ఇందులో ఒక్కటి అమలు చేయలేదన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు అనేది వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు, లాలం బాబ్జి, కొయ్యా మురళీ, గొర్లి రామచంద్రరావు, నాగం గంగబాబు, లగుడు శ్రీనివాస్, పోతల రమణ, సకురు నాగేంద్ర నెహ్రూ, చింతకాయల చినబాబు, సీహెచ్. రాంబాబురాజు, అన్నవరం శ్రీను, రేలంగి రమణాగౌడ్, జాన్ ఆనంద్, కోరుమిల్లి లలిత, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలు

తుని రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో తునిలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాల్లో మండలంలో అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి బైక్ ర్యాలీలు నిర్వహించి తునిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వి.కొత్తూరులో మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, చామవరంలో తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, హంసవరంలో జిల్లా అధికార ప్రతినిధి రాయి మేరీ అవినాష్, తేటగుంటలో ఆత్మ మాజీ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, కేఓ మల్లవరంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల నుంచి బయలుదేరి నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. డి.పోలవరం, లోవకొత్తూరు, మర్లపాడు, రాజుపేట, టి.తిమ్మాపురం, వల్లూరు, చేపూరు, కొలిమేరు, ఎస్.సూరవరం తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులు కోటనందూరు మండలం నుంచి బుధవారం భారీగా తరలివెళ్లాయి. ఎంపీపీ లడుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 17 పంచాయతీల నుంచి రెండు వేల ద్విచక్ర వాహనాలపై నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తుని తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, లాలం బాబ్జీ, వెలగా వెంకటకృష్ణాజీ, చింతకాయల చినబాబు, లంక ప్రసాద్, సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, నల్లమిల్లి గోవిందు, రుత్తల జోగిరాజు, బొత్స సత్తిబాబు, కుంచే అచ్చిరాజు, తుమ్మల నాగేశ్వరరావు, వేముల రాజబాబు, దొగ్గా బాబులు, బొంగు ఉమారావు, పసగడుగుల వరహాలు, గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, సారిక దేవుడు, వేగి అప్పలనాయుడు పాల్గొన్నారు.



తుని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, నాయకులు



వి.కొత్తూరు బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు



కోటనందూరు నుంచి తుని తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



గుమ్మరేగుల నుంచి ప్రత్తిపాడు తరలివెళుతున్న సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, కార్యకర్తలు

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- పథకాలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారు
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై మండిపడ్డారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ అమలుకాని హామీలిచ్చి, అరచేతిలో వైకుంఠం చూపారని, నమ్మి ఓటేసిన పాపానికి ప్రజలను నిలువునా మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పార్టీ నాయకులతో కలసి ముద్రగడ డిప్యూటీ తహసీల్దార్ కె పుణ్యవతికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, నాయకులు వాసిరెడ్డి జమీలు, అడపా సోమేష్, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, దో చిట్టిబాబు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, బదిరెడ్డి గోవిందు, కాకి నాని, నరాల శ్రీను, శెట్టిబత్తుల కుమార్‌రాజా, కొండపల్లి అప్పారావు, ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, జెడ్పీటీసీ గొల్లు దివాణంతో పాటు నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు భారీ ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత కళామందిర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, పంచాయతీ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ముద్రగడ గిరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంటరాగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహించారు.



అభిమానులతో కలిసి ప్రత్తిపాడులో ముద్రగడ గిరిబాబు బైక్ ర్యాలీ

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

వెన్నుపోటు నిరసనకు వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు వెంటరాగా కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడుకు బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రత్తిపాడులోని ప్రగతి స్కూల్ వద్ద స్థానిక సీఐ బి సూర్య అప్పారావు ర్యాలీకి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో బస్ కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ కొనసాగించి అక్కడి నుంచి కాలినడకన అంబేడ్కర్ కళామందిర్, పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించి, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు ఉపక్రమించారు.

ఏలేశ్వరం నుంచి ..

ఏలేశ్వరం: రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్తిపాడు తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నేతృత్వంలో మండలం నుంచి వందలాదిగా పార్టీ శ్రేణులు వెళ్లారు. పట్టణంలో పార్టీ నేతలు సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు ఆధ్వర్యంలో వేర్వేరుగా ద్విచక్ర వాహనాలపై ప్రత్తిపాడు వెళ్లి ఆందోళన పాల్గొన్నారు. పెద్దనాపల్లి నుంచి పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, సీనియర్‌నేత గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీనేతలు పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, జువ్విన వీర్రాజు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

రౌతులపూడి: ప్రత్తిపాడులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. కిర్లంపూడి వెళ్లి అక్కడి నుంచి ప్రత్తిపాడు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివానం, వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుమల రాయల్‌సాయి, మండల పార్టీ కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, పులి మధు, రాయి ప్రసాద్, గొల్లు వెంకటరమణ, కాకి నాని, సైపురెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

కిర్లంపూడిలో బైక్ ర్యాలీ

కిర్లంపూడి: ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన బైక్ ర్యాలీ భారీ జన సమూహంతో హోరెత్తింది. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసం నుంచి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నాలుగు మండల నుంచి వేలాది సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీగా ప్రత్తిపాడు చేరుకున్నారు.



ప్రత్తిపాడులో ముద్రగడ బైక్ ర్యాలీని నిలువరించిన సీఐ బి సూర్యఅప్పారావు



ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముద్రగడ గిరిబాబు తదితరులు



పెద్దనాపల్లి నుంచి తరలివెళుతున్న పార్టీ శ్రేణులు



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం, తోట రాంజీ



కిర్లంపూడి నుంచి భారీ బైక్ ర్యాలీగా వెళుతున్న ముద్రగడ గిరిబాబు

ఎన్నికల హామీలను నెరవేర్చే దమ్ముందా?



జగ్గంపేటలో నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- జగ్గంపేటలో 'వెన్నుపోటు దినం' ర్యాలీ
- కూటమి పాలనపై తోట ఆగ్రహం

జగ్గంపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దమ్ముందా అని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ పార్టీ పిలుపు మేరకు తోట నరసింహం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. జగ్గంపేట కోనేటి వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు, బస్టాండ్, పోలీసు స్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జేవీఆర్ రమేష్‌కు అందజేశారు. ర్యాలీ సందర్భంగా నేతలు, కార్యకర్తలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై విమర్శలు

మాజీ సీఎం వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ఆరోపణలను ఖండించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూకు అసెంబ్లీలో జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఆయన పక్కనే కూర్చోపెట్టుకునే వారని తెలిపారు. అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్‌గా ఉండే జ్యోతుల నెహ్రూ వైఎస్సార్ సీపీని ఎందుకు వీడారో అందరికీ తెలుసని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీ రాంజీ ,రాష్ట్ర వలంటరీ విభాగం జాయింట్ సెక్రటరీ తోట అయ్యన్న, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం జాయింట్ సెక్రటరీ రామకుర్తి జగాల్, కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షులు ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, జిల్లా అధికార ప్రతినిధి కరుటూరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి శ్రీ.రామచంద్రమూర్తి, జగ్గంపేట నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గుల్లా ఏడుకొండలు, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు రాపేటి శ్రీనివాస్,కార్మిక విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, సీనియర్ నాయకులు తోట బాజ్జి, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, గండేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ చౌదరి,గోకవరం మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, కిర్లంపూడి మండల పార్టీ అధ్యక్షుడు పెనగాటి రాజేష్, జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లరాయి క్వారీ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

రౌతులపూడి: మండలంలోని నల్లరాయి క్వారీ నిర్వహణపై నిర్వాహకులంతా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో క్వారీ, స్టోన్ క్రషర్ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశాలను, మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. కార్మికులకు సరైన భద్రతా సదుపాయాలు కల్పించాలన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండండి: గ్రామాల్లోని ప్రజలంతా సైబర్ నేరాలకు, కోడిపందేలు, గుండాట వంటి నేరాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.అగ్రహారంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలంతా గంజాయి, సారా అక్రమ రవాణా సారాయి తయారీ వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో రౌతులపూడి ఎస్.ఐ జి.వెంకటేశ్వరరావు పోలీసుల పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాల

కడియం: ఘంటసాల అమర గాయకుడని పలువురు పేర్కొన్నారు. వేమగిరిలో ఘంటశాల వీరాభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఆయన జయంతిని పురస్కరించుకుని ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆటో యూనియన్ సభ్యులు, మర్రి సుబ్రహ్మణ్యం, బొర్రా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల– వెంగయ్యమ్మపురం గ్రామాల మధ్యలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంగాయ్యమ్మపురానికి చెందిన చప్పగడ్డి వీరబాబు (32), రామవరం గ్రామానికి చెందిన మండపాల వెంకటాచలం (చిన్న) ఎదురుఎదురుగా మోటారు సైకిళ్లపై వస్తూ వెంగాయ్యమ్మపురం సమీపంలోని జ్యూస్ ఫాక్టరీ వద్ద బలంగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో చప్పగడ్డి వీరబాబు తలకు తీవ్రగాయాలు కావడంతో జగ్గంపేటలోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మండపాక వెంకటాచలం కాలికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వీరబాబు తల్లిదండ్రులకు ఒక్కగాని ఒక్క కొడుకు. వీరబాబు మృతితో తల్లి దండ్రులు చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో తల్లడిల్లిపోతున్నారు.ఈ ప్రమాదంపై ఎటువంటి కేసు నమోదు కాలేదని జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు.

ధూమపానంతో క్యాన్సర్ ప్రమాదం

తుని: ధూమపానం వల్ల క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదముందని, ప్రజలంతా ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ పొగాగు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యులు జగన్మోహన్, వినోద్‌కుమార్, సౌజన్యరత్నం, మాలతీదేవి ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టొబోకో కంట్రోల్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ పి.రాఘవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తునిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్లేట్‌లెట్లు తగ్గితే ప్రాణాపాయం

శంఖవరం: దోమల వల్ల వ్యాపించే డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్లు తగ్గి రోగులకు ప్రాణాపాయం సంభవిస్తుందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో బుధవాం ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.